# మట్టి మారాజు

అన్నం అంటే నాకు చాలా క్రేజ్. పూట పూట తినే అన్నాన్ని, ధాతనామ కరువు బాధితుడిలాగా ఆత్రంగా చూసి, మరీ తింటాదేవిట్రా వీడూ .... అని నా ఫ్రెండ్స్ నన్ను ఎన్నోసార్లు వెక్కిరించారు కూడా! వీళ్ళ వెక్కిరింతలు నాకు లెక్క లేదు గానీ, లెక్కలేనన్ని చిక్కుముడులు విప్పుకొంటూ నెట్టుకొచ్చిన బతుకు తాలూకూ, ఒక్కొక్క పుట విప్పిచూసినప్పుడల్లా నాకు అన్నంపట్ల నిజంగానే క్రేజ్ పెరుగుతూనే వచ్చింది. నా మాటలు వింటుంటే మా ఆవిడకు లాగా మీకూ నవ్వుగానే ఉందికదూ. ఈ దిక్కుమాలిన క్రేజ్ ఏమిటని !

మా నాన్న చాలా అందంగా ఉండేవాడు. నిజంగానే మసిగుడ్డలు చుట్టుకున్న మారాజుగా ఉండేవాడు. నేను మా నాన్నను ఆ మసోడి షెడ్డులోనేచూస్తూ పెరిగాను. ఆ షెడ్ ఓనరు నిలువెల్లా మసిపూసుకొన్నట్లు కనిపిస్తాడని అతన్ని మసోడనిపిలిచేవాళ్ళు. తెనాలి మారీస్‌పేటలో ఆ షెడ్డు ఉన్న సందు అంగుళం అంగుళం నాకు పరిచయమే. రెక్కలు విరుచుకొని కష్టంచేసి, కీలు కీలు దెబ్బతిని మూలబడ్డ కార్మికుడి లాగా షెడ్డునిండా సొట్టలుపడి రంగులు వెలిసిన కార్లుండేవి. నాన్నవంటి మెకానిక్‌లు ఆ కార్లకింద దూరి పడుకొని పెట్రోల్లో ముంచి ఉంచిన ఒక్కొక్క నట్టు బిగిస్తూ ఆ కార్లు బాగుచేసేవాళ్ళు. నేను అక్కడే గొంతుకూర్చుని కారుకింద దూరిపోయిన నాన్నను చూసేవాడిని చూస్తూ చూస్తూ ఉండగా మా నాన్న రెండు రోజుల్లో గడ్డం పెంచి నీరసంగా అయిపోతే ఆయన ఊపిరి పీల్చుకొని బాగుపడ్డట్లు కార్లన్నీ సొట్టలు సవర తీసుకొని ఎంచక్కా కొత్త రంగులేసుకొని తూనీగల్లా బయటికిపోయేవి. మురికి చేతుల్ని, అంతకంటే మురికిగాఉన్న మసిపాతకు తుడుస్తూ నాన్న గర్వంగా తాను బాగుచేసిన కారువంక చూడటం నాకెంతో ఆనందం కలిగించేది. పరిశుభ్రత పాఠం చదువుతూ “నీ చేతిగోళ్ళకు మురికుంది నాన్నా, చేతులు, గోళ్ళు శుభ్రపరుచుకోవలెను అని పాఠంలో ఉంది నాన్నా” అని ఆ మురికివదలని చేత్తో అన్నం తింటున్న నాన్నకు దిగులుగా చెప్పేవాడిని. నాన్న వంటి పేదవాళ్ళను పట్టిపీడించే ఆ ప్రత్యేకమైన మురికి ఏ రకంగానూ వదిలేది కాదని నాకప్పుడు తెలియదు.

రాత్రివేళల్లో షెడ్డులో పనిచేసి ఆలా అలవాటుగా చీకట్లో ధైర్యంగా నడిచొచ్చే నాన్న, పామొచ్చినా సరే కర్రతో అలా అదిలించి, “పోనీరా పాపంనీళ్ళకట్టె, విషంలేని పురుగు” అనే ధైర్యశాలి నాన్న, తనలో సగం కూడా ఎత్తులేని పురుగొచ్చివాలినా ఉలిక్కిపడే ఆ కారు ఓనర్ల ముందు వంగి వంగి నిలబడేవాడు. ఆలా

వంగి వంగి చాలా రోజుల తరువాత నాన్న నిజంగానే బుజాలు కుంచించుకుని నడిచేవాడు. బియ్యం డబ్బుకోసం భయం భయంగా, దీనంగా యాచించేవాడు. వేళయిపోతోందని అమ్మ ఆదుర్దాపడిపోతూ గుమ్మంలో కూర్చుని ఆ బియ్యంలో మట్టిపెడ్డలు, ధాన్యం గింజలు ఏరిపారేసేది. అక్కడే నీరెండలో వెచ్చదనం కోసం ముడుచుకొని కూర్చుని ఉండే మా నానమ్మ అమ్మ పారేసిన వడ్ల గింజలను ఒక్కొక్కటి ఏరి అరచేతిలో నెమ్మదిగా నలిపేసి పొట్టు వూది నా చేతిలో పోసి బియ్యం గింజలు చేటలో పోసిరా నాన్నా అనేది. "నాలుగు గింజలేగా పోతే పోనీ" అనే వాడిని ఏ బొంగరం తిప్పడం మీదో దృష్టి నిలిపి. "తినే గింజలు అలా పారేసుకో వచ్చా, మీ నాన్న రక్తంరా నాన్నా ఇవన్నీను" అనేది వడ్లగింజలు చూపిస్తూ. గ్రీజు, ఆయిల్‌తో తడిసి తడిసీ మోటుదేలిపోయి తెల్లదనం పోగొట్టుకొన్న నాన్న అరచేతుల్లాగే, ఆ బియ్యం గింజలు రంగు రంగుల్లో కనిపించేవి నాకు.

ఎలిమెంటరీ బళ్ళ నుంచి హైస్కూలుకు వచ్చినా ఆ షెడ్డే నాకు దేవాలయం, ఫీజు కట్టాలన్నా పుస్తకాలు కావాలన్నా అక్కడ జనాంతికంగా చెబితే చాలు ఎన్నో మురికి జేబుల్లోంచి నా అరచేతిలో డబ్బులు రాలేవి. నానమ్మ చెప్పినట్లే ఆ రూపాయలు రక్తంలో నుంచి తీసినట్లే అనిపించేవి. నానమ్మ గింజ గింజ కూర్చి అర చేతిలో పోసుచేసినట్టే ప్రతి పైసా లెక్కపెట్టి నా అరచేతిలో ఫీజు డబ్బులు పడేవి. పళ్ళు బిగబట్టి, నిముషం వృధా కాకుండా పుస్తకాలతో కుస్తీపట్టేవాడ్ని. ఎంత చదివినా మసోటి షెడ్లో, నా అరచేతిలో రాలిన డబ్బుకి సరిపోనూ నేను చదవటం లేదేమోననిపించేది. ఎర్రని ఎండలో మొహం కందిపోయి నల్ల డాగులు పడి వడిలిపోయి చెమట్లు కార్చే నాన్న మొహం కళ్ళలో నిలుపుకొని మరీ చదివే వాడిని. నేను కాలేజీలో చేరేక గానీ నా స్వభావంలో, ప్రవర్తనలో, నా ఫ్రెండ్స్ చెప్పే వెకిలితనం, లేకితనం లేదా దేబిరి గొట్టు తనం ఉన్నాయన్న సంగతి నాకు తెలియనే తెలియదు. మా నాన్న, ఆయన తోటి డ్రైవర్లు ఉండే చోటునే మేమంతా ఉండేవాళ్ళం. మేమంతా ఒకేరకం బతుకు బతికే వాళ్ళం. కనుక నాకు ఆ ప్రత్యేక లక్షణాలున్నాయని నాకు తెలియదు. నేను బాగా చదివేవాడిని. నూటికి నూరు మార్కులు తెచ్చుకొని ఒక్కో క్లాసు సులువుగా గట్టెక్కి పోయేవాడిని. నేను బ్రిలియంట్‌ని, గోల్డ్ మెడలిస్ట్‌ని గనక నా దిగువ తరగతి సంస్కారాన్ని నా ఫ్రెండ్స్ సహించగలిగేరు. నన్ను వాళ్ళ కమ్యూనిటీలోంచి వెలివేయలేదు గానీ, కాస్త పాలిష్ పెడదామని ప్రయత్నించేవాళ్ళు. నాకు లేని నాజూకు తనం నాకు సంపాదించి పెట్టాలని ప్రయత్నించే వాళ్ళు.

మేమంతా ఓసారి ఓ రాత్రివేళ హాస్టల్ వైపుకు వెళుతుండగా హఠాత్తుగా వర్షం వచ్చింది. అప్పటి వరకూ పేవ్‌మెంట్ మీద పడుకొని ఉన్న ఓ దరిద్ర నారా

యణ దంపతులు గబగబా లేచి అటుగా ఉన్న ఎత్తరుగుల షాపు దగ్గరికీ తట్టా బుట్టాతో పరుగులు తీశారు. మగాడు గబగబా వంటిపైన గుడ్డలు విప్పి ఓ ప్లాస్టిక్ సంచిలో దూర్చి ఓ గోచి పెట్టుకొనే ప్రయత్నంలో ఉంటే, ఆ కడుపుతో ఉన్న ఆడామె ఓ పాత గుడ్డల మూటని పొట్టకు హత్తుకొని గబగబా అరుగెక్కేసింది. ఈ లోగా గాఢనిద్రలో ఉన్న వాళ్ళ రెండేళ్ళ బిడ్డ, ఈ వర్షపు చినుకులకు ఉలిక్కిపడి లేచి దడుచుకొని ఏడుస్తూ నిలబడింది. షాపు వారన నిలబడ్డ తల్లి అరంగుళం కదలకుండా 'ఓసి బేగి రాయేగుంటా' అని అరిచి గగ్గోలు చేస్తే ఏడుస్తున్న పిల్ల తల్లి మాటలకు తేరుకొని, నిద్రకళ్ళలో తూలిపోతూ వర్షంలో తడిసిపోతూ పడుతూ లేస్తూ అరుగు ఎక్కింది. ఆ దరిద్ర దంపతుల దయలేని తనానికి, నా ఫ్రెండ్స్ కొందరు నిర్ఘాంతపోతే. మరికొందరువాళ్ళని తిట్టేరు. ఆ ఇల్లాలి తల్లిదనం మీదే అనుమానం వచ్చింది ఇంకొకడికి. నాకెందుకో అది సహజంగానే తోచింది. నా ఫ్రెండ్స్ నన్ను గొంగళిపురుగుని చూసినట్లు చూచేరు. పసిదాని వంటిపైన గుడ్డలు లేవు. అరుగు దిగితే ఉన్నబట్ట తడుస్తుంది ఆ తల్లికి. ఆ పసికూనను నిర్దయగా వది లేయటం కాదని నేనన్నా. ఈ భూ ప్రపంచంపైన బారెడు నీడలేని, జానెడు గూడు లేని దరిద్రుల బతుకుల్లోకి సెంటిమెంట్లు చోటుచేసుకొనే అవకాశం ఎక్కడ?

"ఉన్న కూరంతా నువ్వే మెక్కుతానంటే తమ్ముడి కేదిరా. ప్రతి దినమూ, నా నోటితో లేదు అనిపించకుండా ఏనాడన్నా చెయ్యి కదిగేవ్రా" అని విసుక్కుంటూ ప్రతి రోజు నా కంచం దగ్గర మెతుకులు తీసే మా అమ్మ మాతృత్వాన్ని నేను శంకించగలనా ? ఉన్న గుప్పెె డన్నం ఇద్దరం అన్నదమ్ములం సరిగ్గా పంచుకుని తినాలనే ఆవిడ వాదన నిజమే కదా? నాది వితండవాదం అంటే ఎల్లాగా? సునాయాసంగా డిగ్రీలు పొంది పరీక్షలు రాసి ఉద్యోగం సంపాదించటం నాకు కష్టం కాలేదు. మీ కులాలే మీకు శ్రీరామరక్ష అని నా స్నేహితులు దీవించిన నా ఉద్యోగం నాకొచ్చింది. అంచలంచెలుగా ప్రమో షన్‌లు వచ్చాయి. ఎత్తెత్తు మెట్లున్న మంచి మంచి ఇల్లొచ్చింది, ఇల్లాలొచ్చింది. ఇంకా చాలా చాలా హోదాలొచ్చాయి. అయినా నాతండ్రి నడిచిన ఆ దారి, ఆ దుమ్ము రోడ్డు విడిచి రావటం నావల్లకాదు. రాత్రిళ్ళు మేలుకొని పనిచేసేందుకు టీ తప్ప ఇంకేం ముట్టుకోకుండా బతికిన మా నాన్న నలభై లకే నూరేళ్ళు నిండినా కుంగి కృశించి నానమ్మ రాలిపోయినా, దారిద్ర్యపు పెను తుపానులో చిక్కుకొని దెబ్బతిన్న పక్షిలా, నిత్య రోగిలా అమ్మ ప్రాణాలతో నాకు మిగిలి పోయింది. ఇప్పటికీ సాయం త్రాలు ఆ రోడ్డున నడుస్తా. ఆ దుమ్ములో నాన్న అడుగుల గుర్తులు ఉన్నాయన్న నమ్మకంతో వెదుకుతా. మనుషుల్లో కులాలున్నాయి. తిండిగింజల కొలతకి పనికొచ్చే

రేషన్ కార్డులకు రంగులున్నాయి. దరిద్రం మాత్రం రూపం మార్చుకోనట్లు షెడ్డు పనిలో మార్పు రాలేదు. నాన్నవంటి ఇంకా కొందరు, కొత్త తరం వాళ్ళొచ్చారు. నా పిల్లలతో నిత్యం అక్కడే నేను కాలక్షేపం చేస్తుంటే ఆ మురికి మనుషుల మధ్య నా పిల్లలు తిరగాడుతుంటే వాళ్ళకు మురికి సంస్కారమే అంటుతోందని నా భార్య బాధపడిపోయింది. నాకు తెలుసు. పొట్టనింపే పట్టెడన్నం కోసం సందులలో పందుల వలె ఎలా మనుషులు తమ జన్మ సంస్కారం పోగొట్టుకొని బతకవలసి వస్తోందో నాకు గాక మరెవరికి తెలుసు.

ప్రేమని, ఆప్యాయతని, అభిమానాన్ని, సంస్కారాన్ని దేన్నయినా సరే మాటలతో చూపించగలిగేది కాదు, సమయం కావాలి. డబ్బు కావాలి. రక్తాన్ని చెమటగా, డబ్బుగా మారిస్తే ఆ డబ్బుని గుప్పెడు అన్నంగా మార్చేందుకు జీవితం సరిపోతే, మా ఆవిడ, నా స్నేహితులు చెప్పే వాళ్ళ స్థాయి,సంస్కారం, వీళ్ళకి ఈ జన్మలోరాదూ. రాదన్నమాటే. నేనూ నా పిల్లలు సాయంత్రాలు నా ఆఫీసు అయ్యాక మనోడి షెడ్డువైపు ఆ దుమ్ములో షికారెళతాం. చిన్నప్పుడు నేనెలా గొంతుక్కూచుని చూసేవాడినో అచ్చం అలాగే నా పిల్లలు కార్లదగ్గర వంగి కూర్చుని ఎన్నో మురికి చేతుల్లో ఉన్న శక్తిని ఆశ్చర్యపోతూ చూస్తుంటారు. నాన్న తోటివాళ్ళు చాల మంది నాన్నకు మల్లే నూరేళ్ళు నిండకుండానే పోయినట్లున్నారు. మిగిలిన ఒకడో ఇద్దరో“ఒరే మన వెంకటేశం కొడుకురా ఆడిప్పుడు పెద్ద ఆఫీసరు. ఈ పిల్లకాయల్ని సూసుకోకుండా ఎల్లిపోయాడేంటిరా ఆడూ....”అని పోయిన మానాన్నని తలచుకొనే వాళ్ళు. ఎన్నెన్నో మురికిచేతుల్లోంచి నా అరచేతిలో రాలిన చిల్లరడబ్బులు గురించి, రక్తాన్ని రూపాయలుగా మార్చిన అద్భుతం గురించి, రారాజు వంటి నాన్న అందం గురించి నేను మా పిల్లలకు కథలు కథలుగా చెపుతూ ఉంటా, ఆ దుమ్ములో కాళ్ళు మునిగేలా నడుస్తుంటే మా నాన్నను తాకిన అనుభూతి నాకు. ఇలా దుమ్ముకొట్టుకోవటం గురించి మా ఆవిడ చాలా విసుక్కునేది. నా ప్రవర్తన అనాగరికంగా ఉందని పిల్లలను షెడ్డులో తిప్పి పాడుచేస్తానని సాధించేది. విశాలమైన డైనింగ్‌టేబుల్ మీద అందమైన పింగాణీ కంచాలలో అన్నం వడ్డిస్తే సున్నితంగా లేదా నాజూగ్గా తినటం చేతగాని నా వెకిలితనం పట్ల ఆమెకుకోపం. అలా ఆత్రంగా అన్నం తినేయటం నాకు గొప్ప అనుభవం. ఈ ఆకలే మనిషి బతుకుదారిని నిర్దేశించేది. తన కుటుంబం ఆకలి తీర్చేందుకు మా నాన్నని గులామును చేసింది ఈ గుప్పెడు అన్నమే. అధికారానికీ, డబ్బుకీ తలవంచని నాన్నని గుర్తుకు తెచ్చేది ఈ అన్నమే. ఆకలి తీర్చే విషయంలోనే దరిద్రుడిని, ధనికుడిని ఒకటిచేసిన ఈ అన్నం అంటే నాకు క్రేజ్.

*

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)